నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం డిసెంబర్ 04, 2024 www.navatelangana.com

మున్సిపల్‌లో ప్రజావిజయోత్సవ కార్యక్రమాలు

- హాజరైన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్న రంగోలి, మెగా వైద్యశిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. మంగళవారం కామారెడ్డి పురపాలక సంఘం కార్యాలయంలో మహిళలకు నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు, సిబ్బందికి నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు,మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, మున్సిపల్ కమీషనర్ శ్రీహరి, డిప్యూటీ ఈఈ వేణు గోపాల్, కౌన్సిలర్స్, తదితరులు పాల్గొన్నారు.

మెండోరాలో నాలుగిండ్లు దగ్ధం

- ఎగిసి పడ్డ మంటలు..
- సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం

నవతెలంగాణ-మెండోర



మెండోరాలో మంగళవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదం లో నాలుగు ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దాదాపు 20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాద సమయంలో కుటుంబీకులు వ్యవసాయ పనులకు వెళ్లడం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా దాదాపుగా గంట తర్వాత ఫైరింజన్ వచ్చింది. అప్పటికే నాలుగు ఇండ్లు పూర్తిగా కాలిపోయాయి. భారీ అగ్ని ప్రమాదం జరిగినా ఒకే ఫైర్ ఇంజన్ రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ ఇంజన్ ఆలస్యంగా రావడమే కాకుండా ఒక్క ఫైర్ ఇంజన్ రావడంతో మంటలు సకాలంలో అదుపులోకి తీసుకురాకపోవడంతో పెద్దఎత్తున ఆస్తినష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రూ.21 వేల కోట్ల
పంట రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే

- అన్ని హంగులతో సమీకృత రెసిడెన్సియల్ స్కూళ్ల నిర్మాణం
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

నవతెలంగాణ-బోధన్





మండల పరిషత్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్.. ఇంటిగ్రేటెడ్ గురుకుల ఏర్పాటుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైతులకు 21 వేల కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల పాలయ్యిందని అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బోధన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 15 లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. రూ. 66 లక్షలతో చేపట్టనున్న బోదన్ మండల ప్రజా పరిషత్ నూతన భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లాల్ సమీపంలో అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం నిర్మిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా బెల్లాల్ సమీపంలోని మధు మలంచా డిగ్రీ కళాశాల వద్ద స్థలాన్ని పరిశీలించారు. హాస్టల్ భవనం లేక అద్దె భవనంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో నూతన భవనం నిర్మాణం కోసం.. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.

అనంతరం బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, ఇతర వైద్యాధికారులతో సమావేశమై, వైద్యుల ఖాళీలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ఖాళీగా ఉన్న డాక్టర్లు, స్టాఫ్ నర్సుల పోస్టులను వెంటనే భర్తీ అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.

అభివృద్ధి పనులలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యా, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే అన్ని విద్యా సంస్థలు ఒకే ప్రాంగణంలో ఉండేలా బెల్లాల్ మధుమలంచ డిగ్రీ కళాశాల వద్ద సుమారు 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కం హాస్టల్స్ భవన సముదాయం నిర్మించాలని సంకల్పించామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని మంజూరు చేయించామని, జిల్లా ఆసుపత్రిలో నూతన గదులు నిర్మించామని అన్నారు. ప్రజలకు సేవలు అందించే అధికారులకు కూడా సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో బోధన్ ఎంపీడీఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. శిథిలావస్థకు చేరిన బోధన్ మున్సిపల్ కార్యాలయ భవనం స్థానంలో త్వరలోనే రూ. 4 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వివరించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని అన్నారు. రైతులకు 21వేల కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేశామని, వరి పంటకు మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు సన్నరకం ధాన్యం సాగుకు చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ పద్మావతి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సంధ్య, నాయకులు గంగాశంకర్, నాగేశ్వరరావు, సొసైటీ ఛైర్మెన్ శరత్ తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేసి
డబుల్ ఇండ్లను పంపిణీ చేయాలి

- రాజీవ్ గృహకల్పలో సౌకర్యాలు పెంచాలి : సీపీఐ(ఎం) డిమాండ్
- అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న రమేశ్‌బాబు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మరమ్మతులు చేసి వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. అదే విధంగా రాజీవ్ గృహకల్పలో సౌకర్యాలు పెంచాలని కోరారు. గురువారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాగారాం లోని డబుల్ బెడ్ రూం ఇండ్లను, రాజీవ గృహకల్ప సముదాయాలను పరిశీలించిన విషయం విధితమే. కాగా అక్కడ నెలకొన్న సమస్యలపై అదనపు జిల్లా కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల క్రితం నాగారంలో పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో తలుపులు, కిటికీలు, దర్వాజాలు, కరెంటు వైర్లను దుండగులు దొంగిలించారని తెలిపారు. ఫ్లోరింగు, గోడలు ధ్వంసం చేశారని తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం వాటిని పేదలకు పంచడానికి మనసు అంగీకరించక పోవడంతో తిరిగి వాటిని పునరుద్ధరించడానికి లక్షల రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి వచ్చిందని ఆయన విమర్శించారు.

అదేవిధంగా జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ పక్కన, అంకాపూర్, రుద్రూర్, బోధన్ తదితర ప్రాంతాల్లోని డబల్ బెడ్ రూమ్ ఇండ్లు 70కి పైగా పూర్తయినప్పటికీ గత రెండు సంవత్సరాలుగా తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయి పేకాటరాయుళ్లకు, తాగుబోతులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయని ప్రభుత్వం సరైన నిఘా లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నిర్మించటం వలన అవి ఇప్పుడే శిథిలావస్థకు చేరాయని తెలిపారు. కావున వాటిల్లో మరమ్మతులు చేయించి వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పంపిణీ చేసిన రాజీవ్ గృహకల్ప సముదాయాలు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో వాటిని కేటాయించిన లబ్ధిదారులు నివాసం లేకపోవడంతో అవి కొంతమంది అనర్హులు వాటిని ఆక్రమించుకున్నట్టు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనేకం శిథిలావస్థకు చేరాయని వాటి పునరుద్ధరణకు కావలసిన సౌకర్యాలను పెంచటానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని నివాసయోగ్యంగా మార్చి అర్హులైన వారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగపడతాయి తప్ప ప్రజలు వాటిని వినియోగించే పరిస్థితి ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, కమిటీ సభ్యులు విగ్నేష్, పార్టీ కార్యకర్తలు కటారి రాములు, శ్రీనివాస్, పద్మ, దినేష్, సుచిత్ తదితరులు పాల్గొన్నారు.

తడారని గొంతు

- మిషన్ భగీరథ నీరొస్తే ఒట్టు
- తండావైపు కన్నెత్తి చూడని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు
- పంటపొలాల్లో బోరుబావుల, ట్యాంకర్ నీరే గతి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఆ తండా ఒక మారుమూల గ్రామపంచాయతీ. అందరూ గిరిజనులే. ఆ గిరిజనుల ఓట్లు ప్రతి ఒక్క రాజకీయ నాయకునికి కావాలి. ఆ గిరిజనులు కట్టే పన్నులు కూడా ప్రభుత్వానికి కావాలి కానీ ఆ గిరిజనుల సమస్యలను పరిష్కరించడం కోసం ఏ ఒక్క రాజకీయ నాయకుడు గానీ ఏ ఒక్క అధికారికి గానీ అక్కడికి వెళ్లరు. సమస్యలు ఏమున్నాయో కనీసం పర్యవేక్షించని పరిస్థితి. వివరాల్లోకి వెళితే..

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని కుబ్య నాయక్ తండాలో సుమారు 600 మంది జనాభా ఉంటుంది. కానీ వీరికి తాగే నీరు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఉన్న ఒక్క బోరుబావి బొట్టుబొట్టుగా పోస్తుంది. మిషన్ భగీరథ నీరు ఈ సంవత్సరం ఫిబ్రవరి నుండి ఒక్క చుక్క వచ్చిందే లేదు అని తండావాసులు పేర్కొంటున్నారు. చివరికి తండా వాసులు ప్రత్యామ్నాయంగా పంట పొలాల నుంచి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కానీ ఫ్లోరైడ్ నీరే తాగాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులకు స్పందించి తాగునీటి కోసం మిషన్ భగీరథ నీటిని విడుదల చేయాలని వారు కోరుతున్నారు.



బొట్టుబొట్టుగా పోస్తున్న బోరు



ట్యాంకర్ వస్తేనే నీరు

ఈ విషయమై సదరు జీపీ పంచాయతీ సెక్రెటరీని సంప్రదించగా తాగునీటి సమస్యలపై మిషన్ భగీరథ ఉన్నత అధికారులకు గత ఫిబ్రవరి నుంచి వారి దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. కానీ నేటికి సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.







పొలాల నుంచి నీటి కోసం బోరు మోటారు, పైపులు ఏర్పాటు చేసుకొని నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

మున్సిపల్‌లో పైసలున్నా
కార్మికులు పస్తులే

- కమిషనర్ లేక నిలిచిన వేతనాలు
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్న కార్మికులు

నవతెలంగాణ-కామారెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్‌లో పైసలు ఉన్నా అందులో పని చేస్తున్న కార్మికులం పస్తులు ఉంటున్నామని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు అన్నారు. వేతనాలు విడుదల చేయకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందని అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల సభకు హాజరైన జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలతో మున్సిపల్ కార్మికులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు మాట్లాడుతూ మున్సి పల్‌లో డబ్బులు ఉన్నాయని, వాటిని విడుదల చేసేందుకు ఏ అధికారికి పర్మిషన్ లేకుండా పోయిందన్నారు. గత మూడు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ సుజాత ఇక్కడి నుండి బదిలీ కావడంతో అప్పటినుండి ఇప్పటివరకు ఎవరికి కూడా డిజిటల్ కీ ఉపయోగించే అనుమతి ఇవ్వలేదని, దీంతో మున్సిపల్ నుంచి డబ్బులు తీసుకోవడానికి ఎవరికి అధికారం లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారుల చొరవ తీసుకొని డిజిటల్ కీ ని ఇన్చార్జిగా వచ్చిన మునిసిపల్ కమిషనర్‌కు ఇవ్వాలని ఆయన కలెక్టర్, అడిషనల్ అడిషనల్ కలెక్టర్ లను కోరారు.

వేతనాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు కట్టలేకపోతున్నామని, కనీసం తినడానికి అన్నం లేక కార్మికులు పస్తులు ఉంటూ అనారోగ్యం బారిన పడుతున్నా.. విధులకు మాత్రం హాజరవుతున్నామన్నారు. ఇకనైనా రెండు రోజుల్లో మాకు జీతాలు ఇవ్వాలి లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లు సిడిఎండి అసిస్టెంట్ డైరెక్టర్‌ను పురమాయించగా వెంటనే ఫోన్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడి 24 గంటల్లో డిజిటల్ కీ ఇచ్చే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమం లో జిల్లా నాయకులు ప్రభాకర్, ప్రభు, శ్రీను శివరాజవ్వ, నర్సవ్వ, లక్ష్మి, బుధవా శంకర్, శానిటేషన్ కార్మికులు, వాటర్ వార్క్స్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 3.51 కోట్ల విలువైన గంజాయి, అల్ఫ్రాజోలం కాల్చివేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో 36 కేసుల్లో పట్టుకున్న రూ. 3.51 కోట్ల విలువ చేసే గంజాయి, అల్ప్రాజోలంను మంగళవారం అధికారులు కాల్చివేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, పెద్దాక్యల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ అమోదం పొందిన శ్రీమెడికెర్ సర్వీస్‌లో గంజాయిని దగ్ధం చేశారు. కామారెడ్డి జిల్లా లోని ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలోని 36 కేసుల్లో పట్టుబడిన 783.36 కిలోల గంజాయి, 16.625 కిలోల అల్ప్రాజోలం, 2.15 కేజీల డ్రై జి ఫామ్, 0.852 గంజాయి మొక్కలను కాల్చివేశారు. నిజామాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి డిస్పోజల్ అధికారిగా ఇచ్చిన అదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ సూపరిండెంట్ హన్మంతరావు, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు గంజాయిని కాల్చివేశారు. గంజాయిని డిస్పోజల్ చేసిన ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతే
కొత్త సర్వేలు చేయించాలి

- ఆశాలకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్.. వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు, నాయకులు

పారితోషికాలపై పని చేస్తున్న ఆశాలకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వైద్య అధికారి రాజశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్‌లో లెప్రసీ సర్వే చేయించేందుకు ఆశాలకు ట్రైనింగ్ సైతం ప్రారంభించినట్టు తెలిపారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని గతంలో నిర్వహించిన లెప్రసీ సర్వే, పల్స్ పోలియో విధులకు సంబంధించి పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని డిమాండ్ చేశారు. 2021, 2022, 2023 మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఈ విషయమై కమిషనర్‌ను కలవగా.. రెండేండ్ల డబ్బులు ఇది వరకే రిలీజ్ చేసినట్టు చెప్పారని, ఆ డబ్బులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. సర్వే కన్న ముందే బడ్జెట్ రిలీజ్ చేస్తున్నా.. ఆశాలకు మాత్రం ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఇంటింటి సర్వే చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో కరోనా సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశలు ప్రాణాలకు తెగించి పనిచేస్తే 16 నెలల కరోనా రిస్కిఅలవెన్స్ చెల్లించకుండా వచ్చిన డబ్బులను అధికారులు పక్కదారి పట్టించారని విమర్శించారు. పెండింగ్ డబ్బులు చెల్లించాలని, ఆ తర్వాతనే సర్వే పనులు అప్పగించాలని లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని.. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశాలు రేణుక, రాద, పుష్ప, సరిత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

- వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పనిచేస్తుంది
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్



కామారెడ్డిలో మెమోంటో అందజేస్తున్న కలెక్టర్



నిజామాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల యోగసనాలు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలోని దివ్యాంగుల కోసం 48,446 ధ్రువీకరణ పత్రాలను అందజేశామని, వివిధ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 18 వేల మందికి ప్రతీ నెల 7.26 కోట్ల రూపాయల ఫించన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సకలాంగులు వికలాంగులను పెళ్లి చేసుకుంటే ఒక లక్ష రూపాయలు ఇన్సెంటివ్ ఇవ్వడం జరుగుతున్నదన్నారు. 14 మందికి స్కూటర్లు, 8 మందికి వీల్ చైర్స్ అందించామని అన్నారు. ఎలిమ్కో క్యాంపు లను నిర్వహించుటకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద పనులు కల్పించుటలో రాష్ట్రంలోనే నాలుగవ స్థానంలో నిలచామని తెలిపారు. 64 వేల లేబర్ ను జనరేట్ చేశామని, 2661 వేజ్ సీకర్స్ కు పనులు కల్పించామని తెలిపారు. సదరం క్యాంపు స్లాట్ లను 650కి పెంచామని తెలిపారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి మాట్లాడుతూ, సంస్థ దివ్యాంగులకు అండగా నిలుస్తుందని, ప్రభుత్వం దివ్యాంగులకు కావలసిన అవసరాలను సమకూరుస్తున్నదని తెలిపారు. దివ్యాంగులు మరొకరికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం మేరకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ కింద సులువు పనులు కల్పిస్తున్నట్టు తెలిపారు. పనులు కల్పించడంలో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నట్టు తెలిపారు.

దివ్యాంగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, అంత్యోదయ కార్డులు అందించాలని, రెండు పడక గదులు ఇళ్ళు మంజూరు చేయాలనీ కోరారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఉపాధి హామీ పథకం కూలీలను, సిబ్బందిని శాలువా, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, దివ్యాంగుల యూనియన్ నాయకులు, దుర్గాప్రసాద్, బాలరాజు గౌడ్, పంగ ఈశ్వర్, గాడి నరసింహులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కంఠేశ్వర్ : మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్, గ్రేసి ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్మెంట్ సర్వీసెస్, ఏపీ ఫోరమ్ ఫర్ ఎకనామికల్లీ వీకర్ సెక్షన్, మొదలైన స్వచ్ఛంద సంస్థలతో నడుపబడుచున్న ప్రత్యేక పాటశాలలో విద్య నభ్యసిస్తున్న దివ్యాంగ బాల బాలికలు యోగా ఇతరా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వివిధ ప్రభుత్వ శాఖ లలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు నిరుద్యోగులకు, దివ్యాంగుల కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు సన్మానాలు చేశారు. క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికారిణి సెక్రెటరీ పద్మావతి, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్, మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారిణి రాజశ్రీ, డి.ఆర్.డి. ఏ/డి.ఆర్.డి.వో. ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. సాయాగౌడ్ , ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రతిమా రాజ్ , స్నేహ సొసైటీ సెక్రెటరీ, సిద్ధయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ గ్రేసి ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ శోభా రాణీ , స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి , ఎ.పి. ఫోరం ప్రెసిడెంట్ సి. స్వరూప , జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సభ్యులు రాజన్న, అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వర్షంలో సైతం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం


వర్షంలోను పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ పొద్దుటూరి మురళీధర్ రెడ్డి వర్షంలో సైతం నిలబడి పారిశుధ్య కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బందితో చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ.. ప్రజలు తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్‌కు సంబంధించిన చిత్త సేకరించే వాహనాలకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

5న బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 5న బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, నిజామాబాద్‌కు విచ్చేయనుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్, సెక్రటరీ బి.సైదులు, ఐఎఫ్ఎస్, ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నారని తెలిపారు. ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాలోని ఆయా కులాల స్థితిగతులపై డెడికేటేడ్ కమిషన్‌కు వివిధ సంఘాల వారు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని సూచించారు. అభిప్రాయాలు తెలియజేసే వారు తమ వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, ఆధారాలను సాక్షాలను వారి అభ్యర్థనలతో సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు సరస్వతీరాజ్ హరిదా పురస్కారాల ప్రదానోత్సవం

- జిల్లాకు ప్రముఖ సాహితీవేత్తల రాక

నవతెలంగాణ-కంఠేశ్వర్

హరిదా రచయితల సంఘం ఆరో మహాసభ సందర్భంగా నవ్య భారతి గ్లోబల్ స్కూల్ లో డిసెంబర్ 4 నిర్వహిస్తున్న సరస్వతీరాజ్ హరిదా సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్తలు రానున్నారని సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ తెలిపారు. మంగళవారం సంస్థ కార్యాలయం కేర్ డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆచార్య యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమానికి కీలకవక్తగా తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వర శంకరం హాజరవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సరస్వతి రాజ్ హరిదా తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రసిద్ధ కవి విమర్శకులు, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డికి ప్రదానం చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా దారం గంగాధర్ రాసిన సమాంతర రేఖలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, తొగర్ల సురేష్, నాగనాథ్ థామస్కర్, పి మధు, కొయ్యడ శంకర్ పాల్గొన్నారు.

పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు


శానిటేషన్ కార్మికురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య తెలిపారు. మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్లు ఆకుల రాము, శాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో అవగాహన ర్యాలీ..

తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా అందించాలని పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే ప్లకార్డులను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జంక్షన్ వద్ద..

ప్లాస్టిక్ వినియోగించడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని చిన్నారులు నాటిక ద్వారా అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, కమిషనర్ రాజు హాజరయ్యారు. చిన్నారులు చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ 3వ పోలీస్ స్టేషన్ పరిధిలో సోలో మాన్‌రాజ్ ఆర్ఎస్ఐ హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో ఈనెల 2న మృతి చెందాడని పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సొలోమన్ రాజ్ ఆర్ఎస్ఐ స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను ఏఆర్ ఏసిపి నాగయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐ శ్రావణ్ కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పోలీస్ సిబ్బంది కలిసి పరామర్శించారు.

అధైర్య పడొద్దు.. ఆత్మవిశ్వాసంతో ఉండాలి


విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ ఇస్తున్న ఇరవత్రి మారుతి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్మూరుకు చెందిన ప్రముఖ మోటివేటర్ ఇరవత్రి మారుతి కళాశాలలోని విద్యార్థులకు మోటివేషన్ క్లాసు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే వార్షిక పరీక్షలకు విద్యార్థులు పరీక్షలపై అధైర్య పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. విద్యార్థులు ఇప్పుడున్న స్టేజి నుంచి ఉన్నత విద్య వైపు, జీవితంలో ఎదుర్కోవాల్సిన సవాళ్లను, తమ కెరీర్‌ను ఏ విధంగా మలుచుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు ప్రేరేపించిన మోటివేటర్ ఇరవత్రి మారుతిను కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ రజియుద్దీన్ అస్లాం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పిజిటి ఫిజికల్ సైన్సు టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల, కళాశాలలో పి.జి.టి ఫిజికల్ సైన్సు సబ్జెక్టుకు తాత్కాలిక పద్ధతిలో పని చేయడానికి టిచర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ టి.నళిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సబ్జెక్టుకు సంబంధించిన అర్హత గల అభ్యర్థులు (ఎంఎస్సి, బిఈడి) కలిగి ఉండాలని అసక్తి గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల లోపు జరుగబోయే డెమో తరగతులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

7న ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

- ఆటో యూనియన్ల జేఏసీ పిలుపు

నవతెలంగాణ-నిజాబాద్ సిటీ

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న జరిగే రాష్ట్రవ్యాప్త ఆటో, మోటార్ బంద్ పిలుపులో భాగంగా నిజామాబాద్ ఆటో యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ భవన్, కోటగల్లిలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయుసీఐ ఏఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, ఐఎఫ్‌టియు ఆటో యూనియన్ల బాధ్యులు ఎం.సుధాకర్, హన్మాండ్లు, కే.రాములు, శ్రీనివాస్, శివకుమార్, గంగాధర్ మాట్లాడారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఆటోడ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటోడ్రైవరుకు సంవత్సరానికి



పోస్టర్లను ప్రారంభిస్తున్న ఆటో యూనియన్ల జేఏసీ

రూ.15 వేలు ఆర్థిక సహాయం అమలు చేయాలన్నారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి - ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని కోరారు.

ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరిని నిరసిస్తూ ఆటో బంద్ లో భాగంగా నెహ్రూ పార్ క్ నుండి ధర్నా చౌక్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్ను విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ల నాయకులు సాయిలు, జబ్బార్, విటల్, మోయిన్, సాయికుమార్, సయ్యద్ రఫీయుద్దిన్, అబ్దుల్ ముజీబ్, మారుతి, నబీ, షేక్ అఖ్లాక్, సల్మాన్ ఖాన్, షేక్ సోహెల్, వసీం, బాలాజీ, రాజేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు ఏంచేశారని ప్రజాపాలన విజయోత్సవాలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ సీఎంకు బహిరంగ లేఖ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సంవత్సర కాలంపాటు సాగిన కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వల్ల తెలంగాణ రాష్ట్ర భవితవ్యం అంధకారంలోకి నెట్టబడిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజలకు ఏం చేసారని ప్రజాపాలన విజయోత్సవాల పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చెయ్యడానికి నాంది పలికారని అన్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను నెరవేర్చుటలో గడిచిన సంవత్సర కాలంలో ఎంతవరకు సఫలీకృతం అయ్యారో సమాధానం చెప్పాలన్నారు. ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతులకు,కౌలు రైతులకు 15వేల రైతుభరోసా 3. వ్యవసాయ కూలీలకు 12వేలు, వరి పంటకు 500 రూపాయలు, పేదింటి మహిళకు 2500,


లేఖను చూపిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌తో తులం బంగారం ఇవ్వనందుకు విజయోత్సవాల అని ప్రశ్నించారు. చదువుకునే ప్రతి ఆడపిల్లకు ఎలక్ట్రికల్ స్కూటీ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, యువవికాసం, నిరుద్యోగ భృతి 4వేల పేరుతో యువతను మోసం చేసినందుకు ఈ విజయోత్సవాలా అని ప్రశ్నించారు. ఇచ్చిన ఏహామీ నెరవేర్చారని విజయోత్సవాలు చేస్తున్నారో తన లేఖకు సమాధానం చెప్పాలని అన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- ప్రత్యేక దర్యాప్తు సంస్థ ఎస్ఐఏను నియమించాలి
- మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి బాధిత విద్యార్థి తండ్రి వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కాకతీయ విద్యాసంస్థల హాస్టల్లో ఉండి చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థి శివజాస్మిత్‌రెడ్డి గతనెల 29న మృతిచెందగా మంగళవారం మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి విద్యార్థి తండ్రి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేక దర్యాప్తు సంస్థ ఎస్ఐఏను ఏర్పాటు చేయాలని సమగ్ర విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ పనితీరులో అవకతవకలు, నిర్లక్ష్యంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు సంస్థను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల యాజమాన్యం, హాస్టల్ వార్డెన్, తన కొడుకు మరణానికి కారణమైన ఇతర వ్యక్తులపై కఠిన


ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్న విస్తున్న భాస్కర్ రెడ్డి

చర్యలు తీసుకోవాలని అన్నారు. బాబు ఆరోగ్యం పై తమకు సరైన సమయంలో సమాచారం ఇవ్వలేదని కేవలం అనారోగ్యంతో ఉన్నాడని పాఠశాల అధికారుల నుండి కాల్ వచ్చిందన్నారు. పాఠశాలకు రాగానే కొడుకు స్పృహ కోల్పోయాడని, ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారని అన్నారు. సకాలంలో వైద్య సహాయం అందించి ఉంటే ఇంత విషాదం జరిగేది కాదని అన్నారు.

ఈ ఘటనపై నిజామాబాద్‌లోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, పోస్ట్‌మార్టం పరీక్ష నిర్వహించారని, అయితే నివేదిక రావాల్సి ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

ప్లీనరీ స్పీకర్‌గా ఎంబీఏ హెడ్ డాక్టర్ సుధాకర్

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

గ్లోబల్ కాంగ్రెస్ ఆన్ సస్టైనబుల్ గ్రోత్ అండ్ డెవలప్మెంట్ సమావేశానికి ప్లీనరీ స్పీకర్‌గా క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ హెడ్ డాక్టర్ సుధాకర్ మాడవేడి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఐన్విన్ రీసెర్చ్ అకాడమీ, ఇంటి (ఐఎన్‌టిఐ) ఇంటర్నేషనల్ యూనివర్సిటీ మలేషియా కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంగ్రెస్ ఆన్ సస్టైనబుల్ గ్రోత్ అండ్ డెవలప్మెంట్ 2024 సమావేశానికి ప్లీనరీ స్పీకర్‌గా క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ సుధాకర్ మాడవేడి ప్రసంగించినట్టు తెలిపారు. ఈ సమావేశం ఈ నెల 11, 13 మలేషియా కౌలాలంపూర్‌లో జరగనుందని, ఈ కాంగ్రెస్లో ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ స్టడీస్ మొదలైన విభాగాలు భవిష్యత్తులో పోషించవలసిన పాత్రపై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడే అవకాశం లభించడం తనకెంతో ఆనందంగా ఉందని, ఇది క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరక్షరాస్యత, పర్యావరణ సమస్య, మంచినీటి కొరత, నాణ్యతలేని విద్య, నైపుణ్యాలు కొరత, వేగంగా పట్టణీకరణ, మారుతున్న సాంకేతికత, నిరుద్యోగం మున్నగు సమస్యలకు ఐక్యరాజ్యసమితి 2015లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. 2030 లోపు సభ్య దేశాలు ఈ లక్ష్యాలని అందుకోవాల్సి ఉంది. వివిధ దేశాల నిర్వహిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రొగ్రెస్ రిపోర్ట్ లో భాగంగా మలేషియాలో ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ సమావేశానికి ఇండియా, మలేషియా, చైనా, ఇండోనేషియా, హంగిరి, హాంగ్ కాంగ్, థాయిలాండ్, మొదలైన దేశాల నుండి అకడిషియన్స్, డెవలప్మెంట్ ఎక్స్పర్ట్లు, ఇతర ప్రతినిధులు హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. ఈ అవకాశం క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకుడు డాక్టర్ సుధాకర్ మాడవేడి కి లభించడం ఎంతో గర్వంగా ఉందని, కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపల్ ఆర్కే పాండే అభినందించారు.

ఏడాది వేడుకలు


రూరల్ క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ భూపతిరెడ్డి బాధ్యతలు చేపట్టి సంవత్సరమైన సందర్భంగా రూరల్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల అభీష్టం మేరకు కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల పాలనకు గడిచిన ఒక్క సంవత్సరం పాలనకు అభివృద్ధి యే విధంగా ఉందో నియోజకవర్గ ప్రజలు గమనించాలని తెలిపారు. భూపతిరెడ్డి అనుక్షణం ప్రజల గురించి ఆలోచిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నాడని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మన రూరల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాడని వారు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి డెలికట్ శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంగా ప్రసాద్, సీనియర్ నాయకులు, నాయకులు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బిఎస్‌కే ఆధ్వర్యంలో "అనీమియా ముక్త్ భారత్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్ నిర్వహించామని వైద్యురాలు డాక్టర్ రుబీనా తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఫార్మసిస్ట్ రజని, ఏఎన్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా బేస్ బాల్ మహిళల జట్టు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 4న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సుద్దపల్లి క్రీడా మైదానంలో బేస్ బాల్ జిల్లా సీనియర్ మహిళల జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జోష్న, కోచ్ మౌనికలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏసిపి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో భీంగల్ సీఐ నవీన్ కుమార్, కమ్మర్‌పల్లి ఎస్ఐ జి.అనిల్‌రెడ్డి ఉన్నారు.

సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం మండల స్థాయిలో సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణపై ఎంపీడీవో అవగాహన కల్పించారు. సీఎం కప్ 2024 గ్రామ స్థాయిలో 7, 8 తేదీలలో, మండల స్థాయిలో 10,11,12 తేదీలలో ఆటల పోటీలను నిర్వహించాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 4వ తేదీలోగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీలలో టామ్ టామ్ ద్వారా, మైకుల ద్వారా చెప్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. సమావేశంలో ఎస్ఐ అనిల్ రెడ్డి, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, మండల పంచాయతీ అధికారి సదాశివ్, మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

నవతెలంగాణ-ముప్కాల్

శిక్షణ కాలం పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు మంగళవారం విధుల్లో చేరినట్టు ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు. లోకేష్, సాయినాథ్, బ్రహ్మ శ్రీనివాస్, సౌమ్య కావేరి విధుల్లో చేరారు. వీరికి పోలీస్ కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ఇన్‌చార్జి సిపిని కలిసిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జిల్లా ఇంచార్జ్ సీపీ సింధు శర్మను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నిజామాబాద్ టీజీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ టి.జోష్న మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఎం) శంకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) ఎన్.సరస్వతి కలిసి వెళ్లారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
బుధవారం | డిసెంబర్ 04, 2024 | www.navatelangana.com

మధ్యాహ్న భోజనం ప్రారంభం



నవతెలంగాణ-తాడ్వాయి
మండలంలోని నందివాడ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం ప్రారంభించినట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి ఏజెన్సీలకు బిల్లులు రాకపోవడంతో మానుకున్నారని తాము రెండు రోజుల క్రితం విద్యా కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీలతో మాట్లాడి ఏజెన్సీని నియమించామని దీంతో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, ఎంపీఓ సవితారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం


ఎమ్మెల్యే, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. రైతులకు నాలుగో విడత రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడంతో ముఖ్యమంత్రి ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గోపాల్‌పేట్ గ్రామ అధ్యక్షుడు కొరపతి శేఖర్, నాయకులు షాహిద్ పాషా, హులామ్ హుస్సేన్, బోయిని హనుమాన్లు, కలీం, గంపల వెంకన్న, మసూద్ తదితరులున్నారు.

చెరుకు సాగుపై దృష్టి సారించాలి

- నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు ప్రభుత్వం సిద్ధం
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్
రాబోయే కాలంలో సాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు చెరుకు పంటతో పాటు, ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గంలోని రైతులు చెరుకు పంటపై దృష్టి సారిస్తే త్వరలోనే చక్కెర ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులందరూ ఐక్యమత్యంతో చెరుకు పంటను పండించడానికి ముందుకు వస్తే ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన రైతులతో చర్చించారు. చెరుకు పంట ఎకరానికి రెండు లక్షల రూపాయల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఈ పంట వైపు దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రంలోని మాచాపురం రోడ్డుకు మొరం పనుల నిమిత్తం రూ.20 లక్షలు మంజూరు కాగా ఆ పనులను ఆయన ప్రారంభించారు. శివాలయం నుంచి ఇండియన్ గ్యాస్ కార్యాలయం వరకు ఆరు లక్షల రూపాయల నిధులతో మొరం పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గంగా పుత్రులు తమ చెరువుకు వెళ్లే అర కిలోమీటర్ రోడ్డుపై మొరం పనులు చేపట్టాలని కోరగా.. మొరం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దూపల్లి నుంచి బ్రాహ్మణపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మూడు కోట్ల నలభై లక్షలు మంజూరయ్యాయని, రైతులు కేజీవీల్ నడిపించకుండా రోడ్డును కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ ప్రజాపాలన సమన్వయకర్త సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, రెంజల్ గ్రామ కమిటీ అధ్యక్షులు సగ్గు వెంకటి, మాజీ సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ మొయినొద్దీన్, ఎంఎల్.రాజు, సాయిబాబా గౌడ్, ఇందిరా దేవి, ఆసాని అనిల్, సాయాగౌడ్, రవి, షబ్బీర్, హైమద్ చౌదరి, గీయసుద్దీన్, గంగాధర్, గైని సాయిలు, గోజ్జ భూమయ్య, రైతులు వెంకటి, సాయన్న, ఆనంద్ కుమార్, యువజన నాయకులు సిద్ధ సాయిలు, శంషుద్దీన్, సద్దాం, ఉబేద్, ఆసాని వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి రాజ్ గంగారెడ్డి ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు నిండిన వారు ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చని, అలాగే 10వ తరగతి పాస్ అయిన వారు ఓపెన్ విధానంలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ తీసుకొవచ్చని రెగ్యులర్ విధానంలో పాస్ అయిన వారితో సమానమైనటువంటి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తులా రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పూజలు

నవతెలంగాణ-లింగంపేట్
ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావుకు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో తుల్జా భవాని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో ఏర్పాటు చేయనున్న మంత్రివర్గంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని తుల్జా భవాని ఆలయాన్ని చేరుకొని అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజు, రామగౌడ్, సాయికుమార్, నగేష్, రమేష్ తదితరులున్నారు.

మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్షా 11 వేలు విరాళం

నవతెలంగాణ-లింగంపేట్
మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి లింగంపేట్ పట్టణ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్షా 11వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, గౌరవ అధ్యక్షులు పోతగోని శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆకుల సంగయ్య, కౌడ రవి, బాలయ్య, బైరయ్య, పోశెట్టి, మారుతి, చందు, సాయి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- కస్తూర్బాను తనిఖీ చేసిన డీఈవో అశోక్

నవతెలంగాణ-రెంజల్
పాఠశాలను పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డీఈవో అశోక్ అన్నారుఏ. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విద్యార్థులలో క్రమశిక్షణను పాటించేలా చూడాలన్నారు. రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థుల విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. బోధన పద్ధతులలో మార్పులు తీసుకురావాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గమనించి విద్యా బోధన చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రత్యేక అధికారిని శ్యామల, ఉపాధ్యాయులు సిపి, స్వప్న, సుజాత, స్వప్న, శిల్ప, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి


మాట్లాడుతున్న మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-నిజాంసాగర్
మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి సూచించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట కాంప్లెక్స్ పరిధిలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశాన్ని మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన నిర్వహకులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. వంటకు ఉపయోగించే సామగ్రి నిలువ చేయడంలో జాగ్రత్త వహించాలని, బియ్యాన్ని నిలువ చేసే ప్రదేశాన్ని శుభ్రపరచుకొని సంచులు ఏ విధంగా స్టోరేజ్ చేసుకోవాలి, నాణ్యమైన వంట సామగ్రి, మంచి నూనె, చింతపండు, కారం, ఉప్పు లాంటి పదార్థాలను ఆగ్‌మార్క్ కలిగిన ప్యాకింగ్ చేసిన వంట సామగ్రిని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. పచ్చి మిరపకాయలను ఎండబెట్టి ఆరిన తర్వాత కూరలలో వేయకూడదని దానివల్ల ఫంగస్ ఇన్ఫెక్షన్ జరిగి విద్యార్థులు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. వంటగదిని వారంలో ఒకసారైనా శుభ్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా వాటర్ ట్యాంకులపై మూతలను ఉంచేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వ్యక్తిగత శుభ్రత అవసరమని ఆయన అన్నారు. మహిళా భోజన నిర్వాహకులు తలకు, చేతులకు, బ్లౌజులు వేసుకోవాలని, క్వాలిటీ ఉన్న కోడి గుడ్లను మాత్రమే విద్యార్థులకు అందించాలని అన్నారు. గుడ్డును ఉడక బెట్టేముందు నీటిలో వేసి వాటి నాణ్యతను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరామిరెడ్డి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జోసఫ్, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, సిఆర్‌పిబి శ్రీధర్ కుమార్, కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలి

- 24 గంటలు షిఫ్ట్‌ల వైస్ పనిచేయాలి
- రూ.258 కోట్ల నిధులతో పనులు
- వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

నవతెలంగాణ-వర్ని
సిద్దాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించటానికి రూ.258 కోట్లతో ఒక టీఎంసీ కెపాసిటీతో నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్

నవతెలంగాణ-లింగంపేట్
మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్ నేరాలపై లింగంపేట్ ఎస్సై సుధాకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆధార్‌కార్డు, వ్యక్తిగత వివరాలు అడిగితే సమాచారం ఇవ్వవద్దని సూచించారు. సైబర్ క్రైమ్ మోసాల బారిన విద్యార్థిని విద్యార్థులు పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, లెక్చరర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనపూర్‌లో వరినాట్లు షురూ

- బీహార్ కూలీలకే ప్రాధాన్యత

నవతెలంగాణ-వర్ని
మండలంలోని పలువురు రైతులు వరి నాట్లు షురూ చేశారు. ఘన్‌పూర్ గ్రామ రైతులు కార్తీక్, గౌతమ్ రైతుల పంట చేనుల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి.

తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీగా మద్నూర్ ఎస్‌టిఓ శివరాజ్

నవతెలంగాణ-మద్నూర్
తెలంగాణ గెజిటెడ్ అధికారుల యూనియన్ కామారెడ్డి జిల్లా జాయింట్ సెక్రెటరీగా మద్నూర్ ఎస్‌టిఓ శివరాజ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు రాష్ట్ర కమిటీ నాయకులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాగంగా మద్నూర్ ఎస్‌టిఓ శివరాజ్‌కు రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎన్నిక పత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన శివరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సమస్యలపై పోరాటంలో ముందుంటానని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా జాయింట్ సెక్రెటరీగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీ నాయకులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- డి.ఎస్.పి నాగేశ్వరరావు
- ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డిఎస్‌పి నాగేశ్వరరావు

నవతెలంగాణ-భిక్కనూరు
మద్యం సేవించి వాహనాలు నడపవద్దని డి.ఎస్.పి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాజంపేట్, భిక్కనూర్, దోమకొండ మండలాల్లోని ఆటో డ్రైవర్లకు డి.ఎస్.పి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మై ఆటో ఈజ్ సేఫ్ అనే అంశంపై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశారు. ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ కాగితాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సైలు సాయికుమార్, పుష్పరాజ్, పోలీసులు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

- ఎస్ఐ సుధాకర్

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన బాధితునికి లింగంపేట్ ఎస్సై సుధాకర్ సెల్‌ఫోన్‌ను మంగళవారం అందజేశారు. ఐలాపూర్ గ్రామానికి చెందిన నీరడి లక్ష్మణ్ తన మొబైల్ ఫోన్ పోయిందని లింగంపేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్ చేసి బాధితునికి అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు బీబీపేట్ విద్యార్థి ఎంపిక

- విద్యార్థిని అభినందించిన ప్రధానోపాధ్యాయులు


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-కామారెడ్డి(బీబీపేట్)
జాతీయస్థాయి హాకీ పోటీలకు బిబిపేట మండల కేంద్రంలోని తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు విద్యార్థిని ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలలో అండర్ 14 బాలికల విభాగంలో హుజురాబాదలో జరిగిన పోటీలలో తిమ్మయ్యగారి సుశీల నారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీబీపేట పాఠశాలకు చెందిన విద్యార్థిని సాంద్ర సిబి చక్కటి ప్రతిభ కనబరిచి గోల్ కీపర్‌గా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ఫిజికల్ డైరెక్టర్ ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సాంద్ర సిబిని అభినందించారు. ఈ విద్యార్థిని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మాండ్‌సర్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీలలో తెలంగాణ జట్టులో గోల్డ్ కీపర్‌గా ఆడనుందన్నారు. ఆ విద్యార్థినిను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు.

నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రంలోని రెంజల్ ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు నెట్‌బాల్ రాష్ట్రస్థాయికి ఎంపికైన వైష్ణవి, కె.అరుణ్, అరవింద్, అజయ్ కుమార్ నలుగురు విద్యార్థులకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఫిరోజ్ హైదర్‌తో పాటు, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించారు. ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, ప్రవీణ్, శంకర్, సలావుద్దీన్, ప్రతాప్, రాజేందర్, గంగాధర్, సురేష్, రాధా మేడం, స్వప్న, ఇంతియాజ్, జుబేరియా, పిడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- ఎంసిపిఐయు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుపై ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ అన్నారు. ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు దఫాలా రైతుబంధు చెల్లించకుండా అన్యాయం చేశారని, ఉచిత బస్సు పథకం పెట్టిన ప్రభుత్వం గ్రామాలకు బస్సు సౌకర్యం లేక 3,000 బస్సులు రద్దు చేసినట్లు వివరించారు. వితంతు, వృద్ధాప్య పింఛన్లను పాత వాళ్లకు మాత్రమే ఇస్తున్నారని, కొత్తవాళ్ల అర్హులైన వారిని గుర్తించి పెన్షన్లు అమలు చేయాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సదానందం, నర్సింలు, రమేష్, కొర్ని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భవనాల శాఖ మంత్రిని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



నవతెలంగాణ-సదాశివనగర్
ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ కోరారు. రోడ్లు భవనాల శాఖ మంత్రిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మంగళవారం కలిశారు. కామారెడ్డి నుంచి వయా తాడ్వాయి, ఎర్రపాడ్, లింగంపేట్, ఎల్లారెడ్డి వరకు నాలుగు లైన్ల రోడ్డును నిర్మించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర జాతీయ రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీని కలిసి అందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సిందిగా మంత్రిని కోరారు.

నాగిరెడ్డిపేట్‌లో 2475 మంది రైతులకు రుణమాఫీ కాలే

- మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండలంలో 2475 మంది రైతులకు రుణమాఫీ కాలేదని నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట్ మండల వ్యాప్తంగా 2475 మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆయన అన్నారు. మాల్‌తుమ్మెద సొసైటీ పరిధిలో 614 మంది, తాండూరు సొసైటీ పరిధిలో 550 మంది, గ్రామీణ బ్యాంక్ ధర్మారెడ్డి శాఖలో 450 మంది, యూనియన్ బ్యాంక్‌లో 911 మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆయన అన్నారు. సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ అయ్యేవిధంగా చూడాలన్నారు. రుణమాఫీ కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు



నవతెలంగాణ-భీంగల్ రూరల్

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం ముచ్కూర్ గ్రామంలో బుధవారం ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ పోలింగ్ కేంద్రాల గుర్తింపుకోసం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, లైట్లు, ఫ్యాన్లు పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చే పోలింగ్ సిబ్బందికి మౌలిక వసతులను పంచాయతీ సిబ్బంది కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలు పై బడిన వారు ఓటు హక్కు లేని వారు ఇప్పటికీ బీఎల్ఓ ద్వారా లేదా సీజీసీ మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

కుల గణన డాటా ఎంట్రీ వంద శాతం పూర్తి



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని 30 గ్రామాలకు సంబంధించిన 14 వేల 574 సర్వే దరఖాస్తులు వచ్చాయని వాటిని సమయానికి కంటే ముందే వంద శాతం ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పూర్తి చేశామని సిరికొండ ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎల్లవేళలా కష్టపడిన ఎంఆర్ఓ రవీందర్, ఏంఈఓ రాములు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పంచాయితీ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేరుస్తుంది



మాట్లాడుతున్న కేసీ వేణుగోపాలచారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేరుస్తుందని మాజీ కేంద్ర మంత్రి కేసి వేణుగోపాలచారి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని 40 వ డివిజన్‌లో కార్పొరేటర్ న్యామతాబాద్ శివ చరణ్ ఆధ్వర్యంలో ప్రజా పాలన సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు రెండు లక్షలకు రుణమాఫీ చేశామని, అలాగే గ్యాస్ సబ్సిడీ కింద 500 రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు క్వింటాలుకు 500 చొప్పున బోనస్‌ను ఇచ్చిందని తెలిపారు. 200 యూనిట్ల వరకు జీరో కరెంట్ బిల్లు, భూమి ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్ళు కట్టి ఇస్తుందని అన్నారు. ఇప్పటివరకు దాదాపు 50 వేల పైచిలుకు ఉద్యోగాలను కల్పించిందని ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ శివ చరణ్ కోరిక మేరకు డివిజన్ ఏరియ లో నిరుపేదలు ఎక్కువగా ఉన్నందున అందరితోపాటు కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని అలాగే ఇంద్రమ్మ పథకంలో నూతనంగా నిర్మించే ఇళ్లకు 40వ డివిజన్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవ వేణు, నాయకులు నరాల రత్నాకర్, మైనార్టీ నాయకులు జావెద్ అక్రమ్, గౌస్, అరుణ్, స్వర్ణలత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మంగళవారం నోటుబుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జయంతి తన తండ్రి తిరుణగరి వేణుగోపాల స్వామి స్మారకార్థం నోటుబుక్కు, పెన్నులను వితరణ చేయగా వాటిని విద్యార్థులందరికీ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు జయంతి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బూస కృష్ణకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ మూర్తి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అన్నాగౌడ్ నారాగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల దేశవ్యాప్త కులగణన సాధన కోసం డిసెంబర్ 16 నుండి 18 వరకు జరగబోయే కార్యక్రమానికి తెలంగాణ బీసీ నాయకులు వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. విద్యా, వైద్య, ఉద్యోగ రంగాల్లో వారి వాటా కోసం ధర్నా చేపట్టినట్టు తెలిపారు. చట్టసభలలో బీసీలకు తమ రావలసిన వాటా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కొయ్యడ నరసింహులు గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజాంబాద్ జిల్లా యూత్ అధ్యక్షులు రాజు గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం యూత్ కార్యదర్శి కపిల్, పవర్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

జీవనభృతిని వెంటనే అమలు చేయాలి

- మంత్రి సీతక్కకు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీవనృతి వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీడీ కార్మికులకు 2023 శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేయూత పథకం కింద జీవనభృతి రూ.2016 నుండి 4 వేలకు పెంచి అన్ని కేటగిరీల కార్మికులకు ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం గడుస్తున్న అమలుకు నోచుకోలేదన్నారు. 2014 మార్చ్ ఒకటో తారీకు నుండి బీడీలు చేస్తున్న పరిశ్రమలో గల బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే చేయూత పథకం ద్వారా జీవన భృతి, పెన్షన్ అమలు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు ఈ ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజన్న, కే సూర్యం, నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రాజేశ్వర్, ఎం వెంకట్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యం రెడ్డి, వెంచిర్యాల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ రాజేందర్, రాజారెడ్డి, తొగరి మధు, నరేష్, మహేష్, మధు, మారుతి పాల్గొన్నారు..

పేదలకు సహాయంగా సిఎంఆర్ఎఫ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బాబా నగర్, పిప్రి, దేవక్కపేట్, ముచ్కూర్ గ్రామాలకు చెందిన, దేశిటి సాయిలు, మంద సుగంధ, దువ్వల సుమత, దేశెట్టి నర్సవ్వ మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు..

వైకల్యం మనిషికి.. మనసుకు కాదు

- సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి : పలువురి సూచన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/జక్రాన్‌పల్లి/ఆర్మూర్

వైకల్యం మనిషికి గాని మనసుకు కాదని దివ్యాంగులు జీవితంలో ఆత్మవిశ్వాసం నింపుతూ ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను అందరూ వినియోగించుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దివ్యంగా దినోత్సవం పురస్కరించుకుని భవిత సెంటర్లో గల ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ శారీరక, మానసిక, అంధ, వినికిడి విద్యార్థులకు వారిలో గల నైపుణ్యత ఆధారంగా ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులకు పండ్లు బిస్కెట్లు అందించారు. భవిత సెంటర్లో పనిచేస్తున్న ఈశ్వర్, టీచర్స్ స్వామి, పద్మజల సేవలను గుర్తించి మండల విద్యాశాఖ పక్షాన శాలువాలతో ఘనంగా సన్మానించారు. పదవి విరమణ పొందిన ఆయా పోసానమ్మను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి లింగన్న, ఉపాధ్యాయ సంఘాలు, సిఆర్పిలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని నిజాంబాద్ మండల వికలాంగుల సీసీ శ్రీరాంకు ఉత్తమ అవార్డు అందుకున్నారు. మహిళ, శిశు, వికలాంగుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వికలాంగుల సీసీలకు అవార్డులు అందజేశారు. ఈ కారకమంలో జిల్లా వైద్య ఆధికారి, జిల్లా డిఆర్‌డిఎ అధికారి సాయగౌడ్, డిపియం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..

కమ్మర్‌పల్లి: దివ్యాంగులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంధ్రయ్యా మాట్లాడుతూ.. వికలాంగులను-సకలాంగులుగా తీర్చిదిద్దే కార్యక్రమంతో పాటు, భవిత పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దివ్యాంగ పిల్లలను పాఠశాలకు తీసుకువచ్చే తల్లిదండ్రులకు ఎస్కార్ట్ అలవెన్స్, భవిత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రయాణభత్యం, అనేక రకాల సదుపాయాలు కల్పించడంలో భవిత పాఠశాల సేవలు మరువలేనివని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలయ్య మాట్లాడుతూ.. ప్రతి గురువారం భవిత పాఠశాలలో ఫిజియోథెరపీ (భౌతిక చికిత్స) ద్వారా అంగవైకల్యం, పోలియో, మస్తిష్క పక్షవాతం ఉన్న పిల్లలకు ఎంతో లబ్ధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయుడు డి.రాజన్న, ప్రత్యేక ఉపాధ్యాయులు డాక్టర్ విశ్వనాథ్, బి. మధు శేఖర్ సేన, పిఆర్టియు మండల అధ్యక్షులు చంద్రశేఖర్, రాజేశ్వర్, శ్యామల, సీఆర్పీలు అంజయ్య, రాజేష్, అంజయ్య, ఎంఐఎస్ సురేందర్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్, దివ్యాంగులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో...

ఆర్మూర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో మంగళవారం "ప్రపంచ వికలాంగుల దినోత్సవం" పురస్కరించుకొని బధిర ఆశ్రమ పాఠశాలలో మూగ చెవిటి పిల్లలకు స్వీట్స్, స్నాక్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శి మ్యాక శ్రీకాంత్,మేనేజర్ సువర్ణ కిరీటి, ప్రిన్సిపాల్ శాంతమూర్తి, సభ్యులు చెన్న రవికుమార్, విజయనంద్, ద్యాగ ఉదయ్, శ్రీధర్, శేఖర్ ఫయ్యుమ్, వార్డెన్, టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాలో తాత్కాలిక ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో తాత్కాలిక ప్రతిపాదికన ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ స్వప్న తెలిపారు. జూనియర్ కళాశాలలో తెలుగు బోధించుటకు అర్హత కలిగిన మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ, బీఈడీ తెలుగు పండిట్ ఉత్తీర్ణులైన వారు ఈనెల 4 నుండి 6 వరకు కేజీబీవీ స్కూల్‌కు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రెండు సెట్ల స్టడీ సర్టిఫికెట్స్ జిరాక్స్ ఆధార్ జిరాక్స్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు రెండు దరఖాస్తు ఫారానికి జతపరచాలని పేర్కొన్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఏర్గట్ల ఉపాధ్యాయుడు

- ఆర్కిమెడిస్ నియమంపై ప్రదర్శన

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు గాండ్ల రాజశేఖర్ ఘనతను సాధించాడు. నవంబర్ 30 నుండి డిసెంబర్ 3 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి ఐఐటీలో జరిగిన "ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్" లో పాల్గొని తన ప్రదర్శనను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన చరవాణిలో నవతెలంగాణ తో ముచ్చటిస్తూ... ప్రతి సంవత్సరం సైన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తారని, ఇది 10 వ ఫెస్టివల్ అని అన్నారు. ఇందులో పాల్గొనబోయే ఉపాధ్యాయులను జాతీయ స్థాయిలో ఐఐఎస్ఎఫ్ కమిటీ ఎంపిక చేస్తుందని తెలిపారు. దేశం నలుమూలల నుండి ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో చేసిన ప్రయోగాలను వారికి పంపితే, ఏ అంశం వారికి ఎక్కువగా నచ్చుతుందో వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా నుండి ఇద్దరం ఎంపిక అయ్యామని అన్నారు. గొప్ప గొప్ప విద్యావేత్తలు, ఉపాధ్యాయుల ఎదుట ప్రయోగాలను చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయుల ప్రదర్శన ద్వారా, ఒకరి నుండి ఒకరు విజ్ఞానాన్ని పంచుకోవడానికి ఇది గొప్ప వేదిక అని తెలిపారు. పుస్తకాల్లో ఉన్న అంశమే గాక విద్యార్థులకు ఏ విధంగా చెపితే సులువుగా అర్థం అవుతుందో ఇక్కడ చూసి నేర్చుకోవచ్చని తెలుపుతూ.. తన అనుభవాన్ని పంచుకున్నారు. "ఆస్పైరింగ్ ఎడ్యుకేటర్స్ అండ్ టీచర్స్ వర్క్ షాప్' తో పాల్గొన్నట్టు తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చిన విద్యావేత్తల ముందు ఉపాధ్యాయుల ముందు ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.



ప్రదర్శన ఇస్తున్న ఉపాధ్యాయులు రాజశేఖర్

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలో ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం వెలుగు చూసింది. నాగారం కు చెందిన ఆటో డ్రైవర్ సలీం స్థానికంగా నిజాంసాగర్ కాలువ వద్ద ఉన్న పట్టణ ప్రగతి పార్కులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.18 నెలల క్రితం భీంగల్‌కు చెందిన యువతితో సలీంకు వివాహం జరిగిందని తరువాత కాలంలో కుటుంబ కలహాలు, గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. సోమవారం వరకు భీంగల్‌లో ఉన్న సలీం ఎప్పుడు వచ్చి ఉరివేసుకున్నాడో తెలియదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సంవత్సరం నుండి ఆమె పుట్టిల్లు భీంగల్‌లో ఉంటుంది. ఈ క్రమంలో అతిగా మద్యానికి బానిసై, అలాగే భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపం చెంది పార్కులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తికి రెండు రోజుల జైలు

- రాత్రి సమయంలో కిరాణా షాపు తెరిచి ఉంచినందుకు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో కిరాణా షాపు నిర్వాకుడు రాత్రి 10 గంటల తర్వాత తెరిచి ఉంచడంతో రెండు రోజుల జైలు శిక్ష పడిందని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ తెలిపారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో నవంబర్ 30 వ తేదీన చంద్రశేఖర్ కాలనీకి చెందిన మోహన్ అనే వ్యక్తి తన కిరణా షాప్‌ని రాత్రి 10 గంటల తర్వాత తెరిచి ఉంచటం వల్ల ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. అనంతరం ఆ వ్యక్తి పై క్లేసు నమోదు చేసిన పోలీసులు డిసెంబర్ 3న రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ కిరాణా షాప్ నిర్వాహకుడు మోహన్‌కు రెండు రోజులపాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. మూడవ టౌన్ ఏరియా పరిధిలో ఎవరైనా పరిమిత గంటలకు మించి షాపులు ఓపెన్ ఉంచితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సుభాష్‌నగర్‌లో చైన్స్ స్నాచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసులను గుర్తు తెలియని దుండగుడు ఎత్తుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం ఏడు గంటలకి నిజామాబాద్‌లోని సుభాష్ నగర్ ఏరియాలో వెంకటరెడ్డి కాంప్లెక్స్‌లో గల రజని కిరణా షాప్‌కు ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి సిగరెట్, తంసప్ తాగాడు. కిరాణా షాప్ ఓనర్‌కు డబ్బులు ఇవ్వగా ఓనర్ ఆ డబ్బులను కౌంటర్లో పెడుతుండగా ఆ వ్యక్తి కిరణా షాప్ ఓనర్ మెడలో నుండి రెండు తులాల బంగారు చైన్ లాక్కొని బైక్ పైన ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వైపు పారిపోయినట్లు తెలిపారు. షాప్ ఓనర్ రజిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాట్య గురువు డాక్టర్ భాశెట్టి మృణాళినికి కళారత్నతో సత్కారం

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రీ సత్య సాయి నిగమం హైదరాబాదులో జరిగిన గురుశిష్య నృత్య పరంపర కార్యక్రమంలో పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో నటరాజ నృత్యానికేతన్ 20 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనపరిచినట్టు నాట్య గురువు డాక్టర్ బాసెట్టి మృణాళినీ మంగళవారం తెలిపారు. 20మంది చిన్నారులు నృత్య ప్రతిభను ప్రదర్శించి ముఖ్య అతిథి అయిన వేదాంతం రాధే శ్యామ్, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మతో ప్రశంసలు కళాభారతి బిరుదులను అందుకున్నారు. నాట్య గురువు డాక్టర్ భాశెట్టి మృణాళినికి కళా రత్న అవార్డుతో సత్కరించారు. కార్యక్రమమునకు సహకరించినటువంటి తల్లిదండ్రులకు నాట్య గురువు కృతజ్ఞతలు తెలిపారు

డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



స్వతంత్ర భారత మొట్ట మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ 140వ జయంతి సందర్భంగా భీంగల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో ఆయన చిత్ర పటానికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ షఫీ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని చదువులో చక్కగా రాణించి ప్రతి విద్యార్థి కూడా దేశానికి సేవలందించే భావి భారత పౌరునిగా రూపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సన, ప్రిన్సిపాల్ రాధా కృష్ణన్ నాయర్, ప్రైమరీ ఇంచార్జి బిను, పాఠశాల ఏఓ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేయడం తగదు

- రైతు జేఏసీ నాయకుల ధ్వజం

నవతెలంగాణ- ఆర్మూర్

రైతు రుణమాఫీ.. పంటలకు బోనస్.. రైతు భరోసా పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి రైతులకు మోసం చేస్తున్నాడని, ఈ నెల ఒకటి తేదీ ముఖ్యమంత్రి విడుదల చేసిన ప్రకటనపై రైతు జేఏసీ నాయకులు వి. ప్రభాకర్, ఇట్టే డి లింగారెడ్డి లు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు పండగ పేరుతో ఉత్సవం చేయడం రైతులను మోసం చేయడమేనని అన్నారు.. వరంగల్ డిక్లరేషన్‌ని ప్రకటించి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రైతు పండుగ చేయడం రైతులను మోసం చేయడమేనని ఎద్దేవా చేశారు. రెండు లక్షల పైన ఉన్నవారు రెండు లక్షలకన్న తక్కువ ఉన్న వారందరికీ సుమారు 45 లక్షల మందికి(మిగిలిన 16 లక్షల మంది) రద్దు అయ్యే వరకు రైతు జేఏసీ పోరాడుతుందనిఅన్నారు. సంక్రాంతికి రైతు భరోసా అమలు చేస్తానని నమ్మ పలుకుతున్న రేవంత్ రెడ్డి 15వేల రూపాయలు వేస్తున్నారా.. లేక ఇందులో ఏమైనా జిమ్మిక్కులు ఉన్నాయా అని ప్రశ్నించారు. పది రకాల పంటలకు క్వింటాలుకు 500 బోనస్ ఇస్తానని చెప్పి దాన్యంలోనే సన్నధాన్యానికి ప్రకటించి దొడ్డు ధాన్యానికి ఎగనామం పెట్టారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించడంతో సన్నధాన్యాన్ని 80 శాతం అమ్ముకున్నారని, వారికి బోనస్ ఎగ్గొట్టడమేనా మీ లక్ష్యమని ప్రశ్నించారు. బి. దేవారం. భూమా రెడ్డి మాట్లాడుతూ ఒక గ్రామంలో 300 మంది రైతులు ఉంటే కేవలం 30 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని అన్నారు. వీటి అమలుకోసం కొద్ది రోజుల్లోనే రైతు ఆందోళన కార్యచరణ ప్రకటించబోతున్నట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు దేవారం , భూమారెడ్డి, సారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ కేసులో జైలు శిక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఒక వ్యక్తికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ దీప్తి తీర్పుని వెలువరించినట్టు ఎస్ఐ అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన సమర గంగా జమున బైక్ చోరీ జరిగిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు మహేష్‌ను అరెస్టు చేసి విచారణ అనంతరం కోర్టులో పోలీసులు అభియోగ పత్రం దాఖలుచేసినట్టు తెలిపారు. కేసులో పూర్వ పరాలను పరిశీలించిన ఆర్మూర్ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ దీప్తి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పుని విలువరించినట్టు తెలిపారు. కోర్టులో సాక్షాలను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్‌లు రామారావు, రాజులను ఎస్ఐ అభినందించారు.

ఎల్లన్న స్మారక సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మాక్లూర్

సిపిఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకుడు పిట్ల ఎల్లన్న 34వ స్మారక సభను గడుకోల్ గ్రామంలో ఈనెల 16న నిర్వహిస్తున్నామని న్యూ డెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు తెలిపారు. మంగళవారం మండలంలోని బోర్గం (కే) గ్రామంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఎల్లన్న స్మారక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. పేదింటిలోపుట్టిన ఎల్లన్న, శ్రమజీవుల రాజ్యం కోసం రైతు కూలీ సంఘం నాయకుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సూర్య శివాజీ, దేశెట్టి సాయి రెడ్డి, కృష్ణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జే.పీ.గంగాధర్, ఎల్. పర్వయ్య, రాపాని గంగాధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు పిపిఆర్ వ్యాక్సినేషన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గొర్రె మేకులకు పిపిఆర్ వ్యాక్సినేషన్ వేసినట్లు మండల పశువైద్యాధికారి ఆశ్రిత తెలిపారు. గ్రామంలోని 994 గొర్రెలకు, 248 మేకలకు పిపిఆర్ వ్యాక్సినేషన్ వేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్య జూనియర్ డాక్టర్ శశికళ, పశువైద్య సిబ్బంది, గొర్రె, మేకల పెంపకం దారులు పాల్గొన్నారు.

స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బి ఇతర పీజీ కోర్సులకు సంబంధించిన మిగిలిన సీట్లను భర్తీ చేయాలని, యూనివర్సిటీలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ కు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో ప్రతి సంవత్సరం ఎల్ఎల్‌బి, ఇతర కోర్సులకు సంబంధించిన సీట్లు మిగిలిపోవడం, విద్యార్థులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. తద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇచ్చారని, తెలంగాణ యూనివర్సిటీకి ఎందుకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించుకునే అవకాశం ఎందుకు ఇవ్వలేరని ప్రశ్నించారు. బీఎడ్. చదువుతున్న విద్యార్థులకు యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్ బి కోర్స్ ప్రవేశపెట్టాలన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్పందిస్తూ, యూనివర్సిటీలో మిగిలిన సీట్ల భర్తీకై అవకాశం ఇస్తారని,హాస్టల్ వసతి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పుప్పాల రవి, పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, టిజివిపి జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కల్యాణ్, టియువి యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి రాంజీ తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ 5
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | డిసెంబర్ 04, 2024 | www.navatelangana.com

యాసంగి పంటకు చెరువు నీటి విడుదల

- పంట కాలువలో పూడిక తీసివేత

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని పలు గ్రామాల్లో బోరుబావులున్న రైతులు ఇప్పటికే వరినారు పోయడం ప్రారంభించారు. మండల కేంద్రంలోని చెరువులో నీరు ఉన్నా రైతులు ఇంకా నారు మడులు పోయనందున రైతుల సమావేశంలో నిర్ణయించిన విధంగానే మంగళవారం చెరువు నీటిని విడుదల చేశారు. నీటి నిర్వహణకై శుక్రవారం ఉదయం పాత పోతంగల్ హనుమాన్ మందిరం వద్ద రైతుల సమావేశం ఉంటుందని, అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.



కొనసాగుతున్న పూడికతీత పనులు

విధుల్లోకి కొత్త కానిస్టేబుల్స్

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ సర్కిల్‌కు నూతనంగా వచ్చిన కానిస్టేబుళ్లకు ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు విధి నిర్వాహణపై మంగళవారం వారికి సూచనలు ఇచ్చారు. కానిస్టేబుల్‌లు జ్యోతి, ఇసాక్, వినయ్‌రెడ్డి నూతనంగా విధుల్లో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేరిన కొత్త కానిస్టేబుల్స్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ

మద్నూర్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల

- రూ.305 కోట్లతో ప్రాజెక్టు పనులు
- 6న మంత్రి జూపల్లి కృష్ణారావుతో శంకుస్థాపన
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు కోసం తీసుకున్న నిర్ణయంలో భాగంగా కామారెడ్డి జిల్లాలోని మొట్ట మొదటి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మద్నూర్ మండలానికి మంజూరు చేశారని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు తెలిపారు. ఈ పాఠశాలను రూ.305 కోట్లతో నిర్మాణం పనులు చేపట్టనున్నట్టు వివరించారు. ఈ పాఠశాల నిర్మాణం కోసం రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి, కామారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా శంకుస్థాపన చేపట్టనున్నట్టు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎంతో కృషి జరుగుతుందని తెలిపారు. అలాగే నూతనంగా ఏర్పడ్డ మద్నూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్మన్ సౌజన్య రమేష్, వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ పాలక వర్గం సభ్యుల ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టే స్థలాన్ని సందర్శించి ఎమ్మెల్యే పరిశీలించారు. మద్నూర్ గ్రామ శివారు పరిధిలోని 499 సర్వే నంబర్లు 20 ఎకరాల స్థలంలో ఈ పాఠశాల నిర్మాణం ప్రారంభించనున్నట్టు తెలి పారు. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్, వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, సాయి పటేల్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, డొంగ్లి మండలాధ్యక్షులు రాజు పటేల్, తహసీల్దార్ ఎండి ముజీబ్, ఆర్ఐ శంకర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఆర్విఎం ఏఈ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే

సోయా వెనక్కు రావొద్దు..

తూకం వేసి సోయా వెనక్కు రావొద్దని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు తెలిపారు. నవతెలంగాణ దినపత్రికలో సోయా పంట లోడ్ వెనక్కి అనే శీర్షికన నవ తెలంగాణలో మంగళవారం వార్త ప్రచురితమైంది. దీంతో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు స్పందించారు. ఉదయం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతు పంట కొనుగోలు చేసిన దానిని ఒక్క విత్తు కూడా వెనక్కి రావొద్దని అధికారులకు ఆదేశించారు. బోధన్ గోదాం నుంచి పంటను వెనక్కి పంపుతున్నట్టు మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ కొనుగోలు జరిగిన సోయా పంట ఎక్కడికి పంపినా.. వెనక్కి వచ్చే ప్రసక్తే లేదని పై అధికారులకు ఈ విషయంపై మాట్లాడుతానని రైతులకు హామీనిచ్చారు. సోయా కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సింగిల్‌విండో అధికారులకు, మార్కెట్ కమిటీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

రేషన్ డీలర్ల భర్తీ ఘనత.. కాంగ్రెస్‌దే

జుక్కల్ నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన రేషన్ షాపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో మూడింటిని భర్తీ చేశామని వాటిని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఏళ్ల తరబడి డీలర్ కొత్త నియామకాలు లేక ఇన్చార్జిలతో వినియోగదారులకు ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ప్రస్తుతం వినియోగదారులకు రేషన్ పంపిణీ ఇబ్బందులు లేకుండా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్, వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, తహసీల్దార్ ఎండి ముజీబ్, ఆర్ఐ శంకర్, కొత్త డీలర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన డీలర్లు ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు.

డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఆదుకుంటాం..

పిట్లం : డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఆదుకుంటామని ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను పరిశీలించారు. '2021-22 సంవత్సరంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నివాసపు ఇండ్లు లేని లబ్ధిదారులకు ఎల్లమ్మ కుచ్చ ప్రభుత్వ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు లేకున్నప్పటికీ కొందరు స్వార్ధ నాయకుల ప్రోద్భలముతో 56 మంది డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలకు మౌఖికాదేశాల మేరకు లబ్ధిదారులు ముందుకొచ్చి నిర్మాణాలు చేపట్టినప్పటికీ బినామీ కాంట్రాక్టర్ కొంతమంది లబ్ధిదారులకు 1 లక్ష 70 వేలు, మరికొంతమంది లబ్ధిదారులకు కేవలం 70 రూపాయలు అందివ్వడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని, తమను ఆదుకోవాలి.' అని డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యేతో విన్నవించారు.

స్పందించిన ఎమ్మెల్యే లబ్ధిదారులందరికీ ఇండ్ల పట్టాలతో పాటు తమకు రావలసిన గృహ నిర్మాణ బిల్లులను వెంటనే చర్యలు చేపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-గాంధారి

తాగుడుకు బానిసై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సర్వర్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. సర్వపూర్ గ్రామానికి చెందిన ముదేల్లి పోచయ్య (45) సర్వపూర్ గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్యను కూడా వేధించేవాడు. ఈ క్రమంలో తన భార్యను తాగటానికి డబ్బులు అడగగా లేవు అని భార్య వినోద చెప్పడంతో పోచయ్య తన భార్యను కొట్టాడు. దీంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్ళిపోయింది. తిరిగి వినోద ఉదయం 10:30 గంటలకు వచ్చేసరికి ఇంటి సమీపంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలున్నారు.

జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం సంగం గ్రామానికి చెందిన సుంకరి మనిషా అలియాస్ జానకి(18) జీవితంపై విరక్తి చెంది సోమవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. చిన్నతనం నుంచి తనకు తల్లిదండ్రులు లేక అందరిలా సంతోషాన్ని కోల్పోయానని మనోవేదనకు గురై ఆమె ఆత్మహత్య చేసుకున్నదని ఆయన తెలిపారు. ఆమె సమీప బంధువులు సుంకరి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలం సాలంపాడ్ గ్రామంలో పేకాటాడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 13 మంది పేకటరాయుళ్లను అరెస్టు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో సహా రూ.59,400 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతిచెందింది. తాండూర్ గ్రామానికి చెందిన మంగలి లింగయ్య భార్య అయిన బాలమ్మ (114) అనే శతాధిక వృద్ధురాలు గత నెల రోజుల నుంచి అనారోగ్యంగా బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. బాలమ్మకు కొడుకులు, కోడళ్లు, మనుమరాల్లు, ముని మనుమరాల్లు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ కోసం మైత్రి ట్రాన్స్ క్లినిక్

- ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్ జెండర్స్ కోసం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్ కోసం ఆలోచించి వారికి ప్రత్యేకత ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు కృషి చేశారన్నారు. అనంతరం ట్రాన్స్ జెండర్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమను గుర్తించి తమ గురించి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ గరిగంటి సప్నా లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో

నవతెలంగాణ-కామారెడ్డి/రెంజల్

విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పంగ ఈశ్వర్, గాడి నర్సింలు, నితీష్ రెడ్డి, రంగ్యానాయక్, ముదులో శంకర్, కోండల్ రెడ్డి, బంటు స్వామి, బంజ రాజు, పేరుమండ్ల రవి, సరేందర్, రాజు, గాండ్ల సాయిలు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షులు సుజాత సూర్య వంశీ, సామెల్ మహంతి, జిల్లా అధ్యక్షులు బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇస్తానన్న పెన్షన్ 6000లకు పెంచాలని, డబుల్ బెడ్‌రూంలు, బస్సు ప్రయాణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, బాలిరెడ్డి, వెంకన్న సిద్దారాంలు, సుజాత, లక్ష్మి, రాజమౌళి, సాయిలు, జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు..

రెంజల్ : మండలంలోని సాటాపూర్ వికలాంగుల పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాలు పురస్కరించుకొని చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, విజయ్ కుమార్, ముత్తమ్మ, రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు భూమాయప్ప, ఉపాధ్యాయులు తాహిర్, రవి, శ్రీనివాస్ రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన నేపథ్యంలో అన్నీ ఏర్పాట్లు చేపట్టాలి

- వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 5న రాష్ట్ర ప్రోహిబిషన్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్‌తో కలిసి మంత్రి పర్యటన ఏర్పాట్లపై, ధాన్యం సేకరణ, సమగ్ర కుటుంబ సర్వే ఆన్లైన్ ఎంట్రీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 5న జుక్కల్ నియోజకవర్గం మద్నూర్‌లో యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ శంకుస్థాపన, మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం, లింగంపేట్ నాగన్నగారి బావి, కామారెడ్డి మున్సిపల్‌లో తాగునీటి వసతుల కల్పన, తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ఆ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి ట్యాబ్ ఎంట్రీలు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు వెంటది వెంట చెల్లింపులు జరిగేలా త్వరితగతిన పూర్తి చేయాలని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పటివరకు 83 శాతం ఆన్లైన్ నమోదు జరిగిందని, మిగతా నమోదు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా సహకార అధికారి రాంమోహన్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహారావు, సిపిఒ రాజారాం, జిల్లా విద్యా శాఖాధికారి రాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణు గోపాల్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో గ్రంథాలయానికి మాజీ జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సయ్య శ్రీకాంత్, శంకర్‌రెడ్డి ఒక్కరు పది వెయ్యిల రూపాయల చొప్పున పోటీ పరీక్షల పుస్తకాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత కష్టపడి చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు.త గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల జ్ఞాన సముపార్జనా, సామాజిక వికాసానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుకుని ఉత్తమ స్థాయిలో ఉండాలని కోరారు. గ్రంథాలయానికి దాతలు ముందుకు వచ్చి తమవంతుగా పుస్తకాలు వితరణ చేయడం గొప్ప విషయమని, ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేసిన దాతలను జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మద్ది చంద్ర కాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశబోయిన శ్రీనివాస్, అననీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, చాముండేశ్వరి, ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి

మండలం లోని చద్మల్, చద్మల్ తాండ, నేరల్, నేరల్ తాండ, దుబ్బతండా, బిర్మల్ తండా, దుర్గం, కొత్తబాది, చిన్న గుజ్జుల్, పెద్ద గుజ్జుల్, లొంక తండా, సోమరం తండా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు బిస గణేష్, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాయకులు

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం స్థల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసినట్లు హౌసింగ్ డీఈ సుభాష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణానికి అవసరమైన స్థలం పరిశీలించినట్లు నమూనా నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ లబ్దిదారులు నమూనాగా పరిశీలించి నిర్మించుకోవలసి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఆశాల డిమాండ్లపై చర్చించాలి

- ఆశా యూనియన్ డిమాండ్

నవతెలంగాణ-వర్ని

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తల డిమాండ్లపై ప్రభుత్వం చర్చించాలని కోరుతూ ఆశా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మోస్రా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విజయకుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆశా కార్యకర్తలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ గౌరవాధ్యక్షుడు నన్నేసాబ్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ, గంగా, బుజ్జి బాయి, రాధ, లక్ష్మి, రాణి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పంచాయతీ కార్మికులపై వేధింపులను ఆపాలి

నవతెలంగాణ-రెంజల్

జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీఓ రఫీ హైమద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచా యతీ కార్మికులతో అధిక పనులను చేయించుకుంటూ, వారిని వేధించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనంతో రాత్రింబవళు పారిశుధ్య పనులను చేయించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన చెప్పారు. ఇకనుంచైనా పారిశుధ్య కార్మికులపై సానుభూతితో అధికారులు పనులు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మమ్మ, పోశెట్టి, పద్మక్క, గంగాధర్, రాజేష్, ప్రవీణ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-బోధన్

నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎస్ఎఫ్ కార్మిక సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ప్రజా భవన్ లో అధికారులకు మంగళవారం విన్నవించారు. కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాల కోసం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ అధ్యయన కమిటీ సభ్యులు చిన్నారెడ్డికి, ప్రజా భవన్ అర్జీ ఇంచార్జీ ఐఏఎస్ అధికారి దివ్యకు కార్మికుల సమస్యలు విన్నవిస్తూ వినతిపత్రం అందించారు. కార్మికులకు ఫ్యాక్టరీ లేఆఫ్ అయినప్పటి నుంచి 9 తొమ్మిది సంవత్సరాల బకాయి వేతనాలు ఇప్పించాలని కోరారు. దానికి సానుకూలంగా స్పందించిన చిన్నారెడ్డి, ఐఏఎస్ అధికారిణి దివ్య తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్మికులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమారస్వామి, ఉపేందర్, పోల్కా స్వామి, నర్సింహులుగౌడ్, దాసు, రాజయ్య, మెదక్ ఫ్యాక్టరీ నుండి జాకబ్, శంబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక నాయకులు

గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ మంగళవారం పరిశీలించారు. వంట చేసే ముందు పాత్రలు, చేతులు ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడుక్కొని వంట చేయాలని సూచించారు. తాజా కూరగాయలతో రుచితో కూడిన వంటలు చేయాలని సూచించారు. వంట గదిలో పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, ఎంపీఓ సవితరెడ్డి తదితరులున్నారు.

వికలాంగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చొరవ చూపాలి



నవతెలంగాణ-బోధన్

వికలాంగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చొరవ చూపాలని ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బోధన్ ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో గల వికలాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వికలాంగుల పోరాట ఫలితంగా ప్రపంచంలో వికలాంగులందరికీ అంతర్జాతీయ దినోత్సవం డిసెంబర్ 3 ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా వికలాంగుల హక్కులపై, వారి సమస్యల పరిష్కారం కోసం వికలాంగుల జాతీయ హక్కుల వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, జిల్లా సహాయ కార్యదర్శి మంజం సాయిలు, జిల్లా ఉపాధ్యక్షురాలు కుమ్మరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.